## 117 ఉత్తమ కథలు ఎంపిక

తెలుగు యూనివర్సిటీ, మార్చి 31: తెలంగాణ సారస్వత పరిషత్తు బాలల కథ సంకలనాలకు ఎంపిక చేసిన కథలను ప్రకటించింది. ఇటీవల పరిషత్తు పత్రిక ప్రకటన ద్వారా ఆహ్వానించిన మేరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ఇతర ప్రాంతాలకు చెందిన రచయితలు, రచయిత్రులు 317 కథలు పంపించారు. అందులో ప్రముఖ రచయితలు రాసిన కథలు 256, బాలల కోసం బాలలు రాసిన కథలు 61 ఉన్నాయన్నారు. వాటిని న్యాయ నిర్ణేతల సంఘం పరిశీలించి ప్రముఖ రచయితలు, రచయిత్రులు రాసిన 86 కథలు, బాలల కోసం బాలలు రాసిన 31 కథలతో కలిపి మొత్తం 117 కథలను ఎంపిక చేసినట్లు తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆస్తిపన్ను వసూళ్లలో జీహెచ్ఎంసీ ఫెయిల్

**నీరుగారిన ఆస్తిపన్ను లక్ష్యం..**

**ముగిసిన ఆర్థిక సంవత్సరం**

**రూ.2100కోట్ల టార్గెట్‌కు**

**రూ.1900 కోట్లు వసూలు**

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : ఆస్తిపన్ను వసూళ్ల నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించడంలో జీహెచ్ఎంసీ అధికారులు ఫెయిలయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆరు జోన్ల పరిధిలో రూ. 2100కోట్ల టార్గెట్‌ను కమిషనర్ ఖరారు చేయగా..దాదాపుగా రూ. 1914.87కోట్లు మాత్రమే వసూలయ్యాయి. అంటే నిర్దేశిత లక్ష్యంలో రూ. 175 కోట్ల మేర వెనుకబడిపోయారు. మార్చి నెలలో వసూళ్లను పెంచే క్రమంలో మొండి బకాయిదారులకుగానూ 90శాతం వడ్డీ రాయితీతో ఓటీఎస్ స్కీంను తీసుకువచ్చారు. కానీ ఆశించిన ఫలితాలు రాలేదు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సర వసూళ్లు వెనుకబడటంలో కారణాలు లేకపోలేదు. గతేడాది అసెంబ్లీ ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పడటం, ప్రజాపాలనలో అధికారులు విధులు నిర్వర్తించి ఆస్తిపన్ను వసూళ్లను పట్టించుకోకపోవడం, ఇటీవల పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడం..అన్నింటికంటే మించి ప్రత్యేక అధికారులను నియమించిన ఫలితాలను రాబట్టడంలో అధికారులు విఫలమయ్యారనే చెప్పాలి. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి వరకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు పౌర సేవా కేంద్రాలను నడిపించగా..చివరి రోజు కలెక్షన్లు ఆశించిన స్థాయిలో రాలేదని అధికారులు చెబుతున్నారు.




భానుడి భగ భగకు నగరంలోని రోడ్లు వెలవెలబోతున్నాయి. మే నెల రాకముందే నిప్పుల కొలిమిలా మారింది పరిస్థితి. ఉదయం పదకొండు గంటల నుంచే ప్రజలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం తెలుగుతల్లి ఫ్లైఓవర్ నిర్మానుష్యంగా మారింది. రానున్న మూడు రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశమున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

# ఎన్నికల సమర్థ నిర్వహణకు శిక్షణ

## నేడు, రేపు 11,442 పీవో, ఏపీవోలకు ట్రైనింగ్

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల సమర్థ నిర్వహణకు పీవో, ఏపీవోలుగా నియమించిన వారందరికీ సోమ, మంగళవారం ఉదయం, మధ్యాహ్న సమయంలో శిక్షణ ఇచ్చేందుకు 15 కళాశాలలో ఒక్కొక్క కాలేజీలో నాలుగు హాల్‌లో మొత్తం 60 హాళ్లలో మొత్తం 11,442 మందికి శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ రోనాల్డ్‌రోస్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఉదయం 50 మంది, సాయంత్రం 50 మంది చొప్పున ఒక్కొక్క హాల్ ఉదయం సమయాల్లో సోమవారం 3వేల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న సమయంలో మరో 3వేల మందికి మొత్తం ఆరువేల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 2వ తేదీన ఉదయం సమయంలో ఇదే హాల్‌లో 3042 మందికి, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జరిగే మరో 2400 మందికి మొత్తం 5442 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఎన్నికల విధుల నిర్వహణలో భాగంగా పీవో, ఏపీవోలకు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసి శిక్షణ తరగతులకు రావాలని కోరారు. వచ్చే వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫారం-12 ఇవ్వనున్న నేపథ్యంలో ఓటరు ఎఫిక్ కార్డు నంబరు, ఓటరుగా నమోదైన నియోజకవర్గంలోని ఓటరు జాబితాలో పార్టు నంబర్ సీరియల్ నంబర్ కూడా తీసుకొని రావాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో తెలుసుకోవాలంటే http://voters.eci..gov.in వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలన్నారు. ఎన్నికల విధులకు సంబంధించిన ఉత్తర్వులతో పాటు ఫారం-12 జత చేస్తూ పంపించినట్లు చెప్పారు.

### వృద్ధులకు ఇంటివద్దే ఓటేసే అవకాశం..

మేడ్చల్, మార్చి31(నమస్తే తెలంగాణ): 85 సంవత్సరాలు పై బడిన వృద్ధులు, నడవలేని దివ్యాంగులు, కొవిడ్ పేషెంట్లకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. ఓటర్ గుర్తింపు కార్డుల ప్రకారం వారిని గుర్తించి ఇంటింటికీ వెళ్లి ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే 12 డీ దరఖాస్తులను బీఎల్‌ఓలు అందజేస్తున్నారు. ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునే వారు ఏప్రిల్ 23 లోపు ఫారం 12 డీ లను ఏఆర్‌ఓలకు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులను రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో పరిశీలించి అర్హులను ఏప్రిల్ 25 న ఎంపిక చేస్తారని, ఏఆర్‌ఓలు షెడ్యూలు రూపొందించి బూత్‌స్థాయి అధికారుల ద్వారా ఓటర్లకు సమాచారం అందించనున్నట్లు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలైన మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలలో 80 ప్లస్ దాటిన వృద్ధులు ఓటరు జాబితాలో 32,880 ఓటర్లు ఉండగా దివ్యాంగులు 21,990 మంది ఉన్నారు.

**శిక్షణ తరగతులు నిర్వహించే కళాశాల వివరాలు**

| కళాశాల | హాల్ నంబరు |
|---|---|
| అరోరా లీగల్ సైన్స్ అకాడమీ | 1,2,3,4 |
| ఏవీ ఆర్ట్స్ సైన్స్ కామర్స్ కళాశాల | 1,2,3,4 |
| డ్రీమ్ ల్యాండ్ గార్డెన్ | 1,2,3,4 |
| జి.నారాయణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ | 1,2,3,4 |
| ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలబస్తీ | 1,2,3,4 |
| జేఎన్‌ఏఎఫ్‌ఏయూ | 1,2,3,4 |
| ముంతాజ్ కాలేజ్ | 1,2,3,4 |
| నిజాం కాలేజీ మల్టీ ఫర్పాజ్ | 1,2,3,4 |
| ఫ్రొపెసర్ జి.రాంరెడ్డి | 1,3 |
| ఫ్రొపెసర్ జి,రాంరెడ్డి సెంట్రల్ హాల్ | 2,4 |
| ఆర్‌బీ వెంకట రామరెడ్డి ఉమెన్స్ కాలేజీ | 1,2,3,4 |
| సరోజీ నాయుడు వనిత విద్యాలయం | 1,2,3,4 |
| ఎస్‌వీఐటీ | 1,2,3,4 |
| ప్రోగ్రెస్ హైస్కూల్ | 1,2,3,4 |
| వాసవి కాలేజ్ | 1,2,3,4 |
| ఉమెన్స్ కాలేజీ | 1,2,3,4 |

### ఆధారాలతో సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలి



**మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్**

మేడ్చల్, మార్చి31(నమస్తే తెలంగాణ): ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై సీ విజిల్‌లో పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు సీ యాప్ ద్వారా వచ్చిన 13 కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. డబ్బు పంపకాలు, ఉచితాలు ఓటర్లను ప్రలోభ పెట్టిన, మద్యం సరఫరా చేసిన, భయభ్రాంతులకు గురి చేసిన, లెక్కకు మించి ఖర్చు, మతపరమైన ప్రసంగాలు చేసిన వీడియోలు, ఆడియో రికార్డు చేసి సీయాప్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు చేసిన వంద నిమిషాలలో ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు.



## ఆకట్టుకున్న సిల్క్ ఎగ్జిబిషన్

వెంగళరావునగర్, మార్చి 31 : శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో ఆదివారం ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను తెలంగాణ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ సింగర్ ఉషతో కలిసి ప్రారంభించారు. చేనేత కళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారుల ఉత్పత్తులను సుమారు 80 స్టాళ్లలో ఏర్పాటు చేసినట్లు సిల్క్ ఇండియా సీఈవో వినయ్ తెలిపారు. ఈనెల 7 వరకు ఈ వస్త్ర ప్రదర్శన వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.




## ముగిసిన ఏఐ, ఎంఎల్ -డేస్ 2024 కాన్ఫరెన్స్

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 31 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) మెషన్ లర్నింగ్ (ఎంఎల్)లపై నిర్వహించిన ఏఐ-డేస్ 2024 జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఐఅండ్‌సీ, ఈ అండ్ సీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, కంప్యూటర్ సైంటిస్ట్ కృష్ణపాలెం, స్వేచ్ఛ సంస్థ వ్యవస్థాపకుడు కిరణ్‌చంద్ర పాల్గొన్నారు.



అవగాహన ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఓయూ, ఐసీఎస్ఐ ప్రతినిధులు

## ఐసీఎస్ఐతో ఓయూ ఒప్పందం

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 31: ఉస్మానియా యూనివర్సిటీ, ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) మధ్య చారిత్రక సహకారం కోసం ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఐసీఎస్ఐ, ఓయూ అధికారులు ఒప్పందంపై సంతకాలు చేశారు. దీని ప్రకారం బహుళ డొమైన్లలో సహకారాన్ని పెంపొందించేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడనుంది. కంపెనీ సెక్రటరీ అర్హత యొక్క గుర్తింపును అంగీకరించేందుకు, సీఎస్ అర్హతను పీహెచ్‌డీ కోసం పీజీ సమానమైనదిగా అంగీకరించేందుకు ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రొఫెసర్లు రెడ్యా నాయక్, అప్పారావు, చెన్నప్ప, కృష్ణచైతన్య, సుధ, శ్రీరాములు, వెంకటయ్య, రాధికాయాదవ్, నరేశ్‌రెడ్డి, ప్యాట్రిక్, శేఖర్, ఐసీఎస్ఐ దక్షిణ భారత చాప్టర్ చైర్మెన్ నారాయణ గుప్తా గమిని, కార్యదర్శి సీఎస్ మహదేవ్ తిరుంగరి, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## మాతృశ్రీ నగర్‌లో పల్స్ హార్ట్ దవాఖాన ప్రారంభం

మాదాపూర్, మార్చ్ 31: మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీనగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన పల్స్ హార్ట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మంత్రి దామోదర రాజ నర్సింహ, ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, కృష్ణారావు ఆదివారం ప్రారంభించారు. హాస్పిటల్‌లో 100 పడకల సదుపాయంతో అత్యాధునిక కార్డియాక్ క్యాథ్ లాబ్, ఆధునిక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, క్రిటికల్ కేర్, జనరల్ మెడిసిన్, జాయింట్ రీప్లేస్‌మెంట్, పల్మనాలజీ, యూరాలజీ, స్పైన్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, విభాగాలతో పాటు కార్డియాక్ కేర్ సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు ఎంఎస్ఎస్, డాక్టర్ ముఖర్జీ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమ కారుల ఫోరం చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్

## ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి,మార్చి31 : ఉద్యమకారులకు 250 గజాల స్థలం హామీని వెంటనే అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'తెలంగాణ అన్ని రంగాల్లో సీమాంధ్ర కార్పొరేట్ వర్గాల ఆధిపత్యం నిర్మూలించడమే తెలంగాణ పునర్నిర్మాణం' అనే అశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమకారులను గుర్తించడం కోసం ఒక కమిటీ ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులకు ఉచిత బస్‌పాస్,ఆరోగ్య కార్డులు అందచేయాలన్నారు. సమావేశంలో రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి పటోల్ల సురేందర్‌రెడ్డి, కోలా జనార్దన్, కరుణాకర్ రెడ్డి, జనిగే విష్ణు, వర్ధన్, కొంతం యాదిరెడ్డి, జ్యోతిరెడ్డి, ఇంద్రకుమారి, అనంతం, లక్ష్మి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు కేసులైనా..

# మళ్లీ పోస్టింగ్

**తొలగించిన వ్యక్తికే మళ్లీ సెక్యూరిటీ, శానిటేషన్ బాధ్యతలు**

**పేట్లబుర్జు ప్రసూతి దవాఖానలో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాకం**

సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ): పేట్లబుర్జు ప్రసూతి దవాఖానలో అవినీతి, అక్రమాలకు పాల్పడే వారిదే హవా నడుస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది ఉద్యోగులు గతంలో అక్రమాలకు పాల్పడి, పోలీసు కేసులు సైతం ఎదుర్కొని, ఉద్యోగంలోనుంచి తొలగింపునకు గురైనా కొందరు అధికారులు తమ స్వలాభం కోసం తొలగించిన వారినే మళ్లీ ఉద్యోగంలో చేర్చుకున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. 2022లో జరిగిన పీజీ వైద్య విద్యార్థుల వార్షిక పరీక్షల్లో డబ్బులు ఇవ్వనందుకు ఫెయిల్ చేశారంటూ ఒక పీజీ విద్యార్థిని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి డీఎంఈ డా.రమేశ్‌రెడ్డి జరిగిన ఘటనపై విచారణ జరిపి, అప్పటి సూపరింటెండెంట్ డా.నాగమణి, ప్రసూతి (ఓబీజీ)విభాగ అధిపతి డా.గరుడ లక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ క్రాంతికుమార్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ వెంకట్ చాట్ల(ఔట్‌సోర్సింగ్)లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారందరిని ఉద్యోగాల నుంచి తప్పించారు. కాగా పీజీ వైద్య విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయడంలో దవాఖానకు చెందిన జూనియర్ అసిస్టెంట్ క్రాంతికుమార్, సెక్యూరిటీ సూపర్‌వైజర్ వెంకట్ చాట్ల తదితరులు కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు వారిపై చర్యలు తీసుకున్నారు. అయితే 2024లో ప్రభుత్వం మారడంతో దవాఖానలో అధికారులు సైతం మారారు. ఉద్యోగం నుంచి తొలగింపునకు గురైన వెంకట్ చాట్లను ఫిబ్రవరిలో తిరిగి సెక్యూరిటీ అండ్ శానిటేషన్ ఇన్‌చార్జిగా తీసుకున్నారు. దవాఖాన ప్రాంగణంలో గత ప్రభుత్వం పార్కింగ్ ఫీజును తొలగించిందని, కొంత మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అనధికారికంగా రోగి సహాయకుల వద్ద నుంచి పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు.

### ఆ సిబ్బంది మా కంట్రోల్‌లో ఉండరు

**డాక్టర్ రజిని, సూపరింటెండెంట్**

వైద్య విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసిన కేసుకు సంబంధించి, అప్పట్లో ఆరోపణలు ఎదుర్కొన్న ఉద్యోగులందరికీ విజిలెన్స్ నుంచి క్లియరెన్స్ వచ్చింది. దీంతో ఉద్యోగులందరూ వారి వారి పోస్టింగ్‌లలో చేరారు. ఇక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి మాకు ఎలాంటి సంబంధం లేదు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మా కంట్రోల్‌లో ఉండరు. కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాల్లో కోత విధిస్తున్నట్లు వింటున్నాం. ఆ అంశం కూడా మా పరిధిలోనిది కాదు. దవాఖానలో ఎలాంటి పార్కింగ్ ఫీజు వసూలు చేయడం లేదు. ఎవరైనా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తే ఫిర్యాదు చేయండి.

## అదనంగా

# మరో 67 ట్యాంకర్లు

**అదనపు వాటర్ ఫిల్లింగ్ పాయింట్స్ ఏర్పాటు**

**పర్యవేక్షణకు ప్రత్యేక అధికారుల నియామకం**

**ట్యాంకర్ బుకింగ్ ట్రాకింగ్ కోసం ప్రత్యేక యాప్**

**అధికారుల సమీక్షలో ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్**

.సిటీబ్యూరో, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో తాగునీటి డిమాండ్‌ను అధిగమించడమే లక్ష్యంగా జలమండలి చర్యలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే తాగునీటి కొరత లేకుండా చూడాలనే ఉద్దేశంతో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఈ సమీక్షలో పలు అంశాల గురించి చర్చించారు. రానున్న మూడు నెలలకు ట్యాంకర్ మేనేజ్ మెంట్ స్ట్రాటజీపై చర్చించారు. అదనపు ట్యాంకర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికపై దానకిశోర్ మాట్లాడారు. అదనపు వాటర్ ఫిల్లింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని జలమండలి ఎండీకి సూచించారు. ప్రస్తుతం ఉన్న ట్యాంకర్ల గురించి ఆరా తీయగా.. ఇప్పటికే 76 కొత్త ట్యాంకర్లు సమకూర్చినట్లు అధికారులు తెలిపారు. ఏప్రిల్‌లో ట్యాంకర్ డిమాండ్ తీర్చేందుకు 5వ తేదీ నాటికి మరో 67 ట్యాంకర్లు అదనంగా సమకూర్చునేందుకు సమాయత్తం అవుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంకర్ ఆపరేటర్లరతోనూ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ మాట్లాడారు. సరఫరా, ఇతర అంశాల్లో సమస్యలేవైనా ఉన్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. జీహెచ్ఎంసీ నుంచి వచ్చిన డ్రైవర్ల సేవలను సమర్థంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. వీరి ద్వారా వాణిజ్య వినియోగదారులకు రాత్రి సమయాల్లో ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయాలన్నారు. శనివారం రాత్రి ఒక్క రోజే.. 299 ట్యాంకర్ల ద్వారా 880 ట్రిప్పులు సరఫరా చేసినట్లు వెల్లడించారు. జంట జలాశయాల నుంచి తరలించిన నీటిని శుద్ధి చేయడానికి కాండ్యూట్ పరిధిలోని 2 ఎంఎల్‌డీ, 3 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్లను పున:ప్రారంభించాలని దానకిశోర్ అధికారులను ఆదేశించారు. వినియోగదారుల నుంచి వచ్చే ట్యాంకర్ బుకింగ్స్, ఫాలో అప్ కోసం ఎంసీసీని పర్యవేక్షించాలన్నారు. వినియోగదారులు తమ ట్యాంకర్ బుకింగ్‌ని ట్రాక్ చేయడానికి ప్రత్యేక యాప్‌ను రూపొందించాలని ఆదేశించారు. అవసరమైతే మే, జూన్ నెలల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అవసరమైతే మరిన్ని వాటర్ ఫిల్లింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు.




### అధికారులకు అదనపు బాధ్యతలు

ట్యాంకర్ల డిమాండ్ ఎక్కువగా ఉన్న డివిజన్ 3, 6, 9, 15, 18 లలో వినియోగదారులకు వేగంగా సేవలందించేందుకు ప్రత్యేక అధికారులను నియమించారు. డివిజన్ 3కి ఖాదర్ మొహీయుద్దీన్, డివిజన్ 6కి వినోద్, డివిజన్ 9కి సుబ్బారాయుడు, డివిజన్ 15కి తిప్పన్న, డివిజన్ 18 కి సాయిరమణను నియమించారు. ఈ సమీక్షలో ఈడీ డాక్టర్ సత్యనారాయణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, ఆపరేషన్ డైరెక్టర్ - 2 స్వామి, సీజీఎంలు, జీఎంలు తదితరులు పాల్గొన్నారు.